క్లుప్తంగా

మానవ హక్కులతోనే సమసమాజ స్థాపన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: సమసమాజ స్థాపనే మానవ హక్కుల ముఖ్య ఉద్దేశమని భద్రాచలం జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి మనిషి హక్కులు–విధులు తెలుసుకుని బాధ్యతగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసెక్యూటర్, సీనియర్ నాయవాదులు పి.తిరుమలరావు, పి.నాగరాజు, లలిత, కళాశాల ప్రిన్సిపాల్ జార్జ్ మిల్టన్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వనసంరక్షణ యాప్‌పై అవగాహన



రేంజ్ కార్యాలయంలో నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలోని అటవీరేంజ్ కార్యాలయ ఆవరణలో అటవీశాఖ సిబ్బందికి వనసంరక్షణ యాప్‌పై ఎఫ్‌డీఓ మక్సూద్ మోహీన్‌ద్దీన్ మంగళవారం అవగాహన కల్పించారు. వనసంరక్షణ యాప్ సంబంధిత బీట్ అధికారులు తమ బీట్ పరిధిలోకి వెళ్లిన తర్వాత యాప్‌లో లాగిన్ అవడం వల్ల వారు క్షేత్రస్థాయిలో నిర్వహించే విధులను అధికారులు హెడ్‌క్వార్టర్‌ల నుంచి పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో దీనిపై అవగాహన కల్పించారు. అనంతరం రేంజ్ కార్యాలయంలో చేపట్టిన నూతన భవన నిర్మాణాలను, కార్యాలయం చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన వెంట దుమ్ముగూడెం రేంజ్ అధికారి కనకమ్మ, డీఆర్వో శోభన్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

టీబీజీకేఎస్‌ను ఆదరించాలి

మణుగూరురూరల్: ఈ నెల 27న జరగబోయే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. మంగవారం మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో ఫిట్ సెక్రటరి అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో అందించిన సేవలను వివరించారు. సమావేశంలో కేంద్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరి అబ్దుల్ రవూఫ్, నాయకులు లక్ష్మణ్, ప్రసాద్, చాంద్‌పాషా, ఆర్.శ్రీనివాస్, శ్రీనివాసరావు, రత్న, అజీజ్, పవన్‌కుమార్, నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ

భద్రాచలంటౌన్: అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏరియా ఆస్పత్రిలో ఉచితంగా ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ప్రారంభించి మాట్లాడారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తెలంగాణ, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చే రోగులు వైద్యం పూర్తి అయ్యే వరకు ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి ఉందని, ఈ క్రమంలో రోగులతో వచ్చే వారికి ప్రతి నెలా ఉచితంగా ఆహారం అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ రాజశేఖర్ రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు మస్తాన్, ఉస్మాన్, ఖలీల్, ఇమాన్, అమీర్, పాషా, బాబాజీ, సాధిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే నివాళి

భద్రాచలంఅర్బన్: గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించడమే బండారు చందర్‌రావుకు ఇచ్చే ఘన నివాళి అని సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. భద్రాచలం డివిజన్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన చందర్‌రావు 38వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముందుగా బండారు చందర్‌రావు స్థూపం వద్ద జెండాను పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ఆవిష్కరించారు. ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు యలమంచి రవి కుమార్, జీఎస్.శంకర్‌రావు, బీబీజీ తిలక్, ఎంబీఎస్ నారాయణలు పూల మాలవేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి.నర్సారెడ్డి, కె.బ్రహ్మాచారి, జిల్లా కమిటీ సభ్యులు ఎం. రేణుక, సున్నం గంగ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యురాలు డి.సీతాలక్ష్మి పాల్గొన్నారు.

మా ఆకలి తీర్చేదెవరు?

- మహాలక్ష్మి పథకంతో రోడ్డున పడ్డాం..
- ప్రభుత్వమే ఆదుకోవాలి..
- ఆటో డ్రైవర్ల వినతి



ప్రయాణికులు లేక ఖాళీగా ఉన్న ఆటోలు

చర్లరూరల్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించారు. దీనివల్ల సాధారణ ప్రజలకు మేలు చేకూరినప్పటికీ ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి పడింది. మహాలక్ష్మి పథకం ద్వారా మా జీవితాలు రోడ్డున పడ్డాయని, ఆటోలనే నమ్ముకుని జీవించే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు ఎవరూ ఆటోలను ఆశ్రయించడం లేదని, ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని చెబుతున్నారు.

ఆటో డ్రైవర్లలో చాలా మంది చదువుకున్న వారు ఉన్నారు. వారి చదువుకు తగిన ఉద్యోగాలు రాక, కుటుంబాలను బతికించుకునేందుకు ఆటోని ఉపాధికి మార్చుకున్నారు. వీరితోపాటు ఆటో తోలే చాలా మంది ఫైనాన్స్‌ల ద్వారా ఆ వాహనాన్ని కొనుక్కోవడమో, కిరాయికి తీసుకొచ్చే రోజులు వెళ్లదీస్తున్నారు. కిరాయివారి సంగతి పక్కనపెడితే.. ఇప్పటికే నెలవాయిదాల చొప్పున ఆటోకొన్ని కిస్తీలు కడుతున్నవారు ప్రతీనెల ఖచ్చితంగా ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

వీరికి అనుకూల రీతిలో ప్రయాణికులు ఎక్కితేనే కిస్తీలు కట్టుకుని మిగిలిన కొంతతో కుటుంబాలను నెట్టుకురావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మహాలక్ష్మి వీరి పరిస్థితి దయనీయంగా మరడానికి దారి తీసింది. ఆర్థికంగా వీరిని వెనక్కు నెట్టడంతోపాటు నెలవారీ కిస్తీలు కట్టడం కష్టతరంగా మార్చింది. తిన్నా తినకపోయినా ప్రతీ నెలా సుమారు రూ.12 నుంచి 15 వేలను కట్టాల్సిందేనని, ఇప్పుడు ఎలా కట్టగలుగుతామని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమను, తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

మా పొట్ట కొట్టకండి..



మహాలక్ష్మి పథకం మా ఆటోడ్రైవర్ల పొట్టలు కొట్టే విధంగా ఉంది. మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యతనివ్వడంతో మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం చొరవ చూపి మమ్మల్ని ఆదుకోవాలి.

– జంజిరాల తులసీరామ్, ఆటోడ్రైవర్, చర్ల

ఎవరూ ఆటో ఎక్కడం లేదు



అప్పులు తెచ్చి ఆటోలను నడుపుతున్నాం. తద్వారా వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో జీవనం గడుపుతున్నాం. మహాలక్ష్మి పథకం వల్ల తమ ఆటోలలో ఎవరూ ప్రయాణించడం లేదు. మా ఆకలి తీర్చేదెవరు?

– మిడియం కృష్ణ, ఆటోడ్రైవర్, గొమ్ముగూడెం–చర్ల

కిస్తీలు ఎలా కట్టాలి?



ఇప్పటి వరకు ఆటోలు నడిచినా మా జీవితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇప్పుడు మహాలక్ష్మి పథకంతో మరింత దుర్భరంగా మారనున్నాయి. ఆటోల కిస్తీలు ఎలా కట్టాలో అర్థంకావడం లేదు. ప్రభుత్వం సహకారం అందించాలి.

– కట్టం అజిత్ కుమార్, ఆటోడ్రైవర్, చర్ల

ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



దుమ్ముగూడెం: ఆలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దంపతులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారిని పినపాక నూతన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ కమిటీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ముత్యాలమ్మ గుడికి వచ్చిన పినపాక ఎమ్మెల్యేను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లంక శ్రీనివాసరావు కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

పాయంకు వినతి..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట, నెల్లిపాక గ్రామ పంచాయతీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మణుగూరులో ఎమ్మెల్యే నివాసంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో ఘనంగా సన్మానించారు. మొండికుంటకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు మొండికుంటను ప్రత్యేక మండలంగా ప్రకటించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మొండికుంట, నెల్లిపాక ఎంపీటీసీలు కమటం నరేష్, గాదె జయ, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, నాయకులు పులసాని రామిరెడ్డి, కందాల వెంకటరెడ్డి, కొండబత్తుల ఉపేందర్, పర్వత నరేష్, వీరమాచనేని రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్మానం..

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ శాసన సభ్యుడు పాయం వెంకటేశ్వర్లును సీపీఐ నాయకులు మంగళవారం వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, సీనియర్ నాయకులు ఆర్.లక్ష్మీనారాయణ, ఎస్‌కె.సర్వర్, మంగి వీరయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు తోట రమేష్, కార్యవర్గ సభ్యులు, వార్డ్‌మెంబర్లు కణితి సత్యనారాయణ, వజ్రా వెంకటేశ్వర్లు, ఎస్‌డి ఉమర్, మంద కోటి, రాయల బిక్షం, బోరుమెల్ల బాలస్వామి, కన్నబోయిన ప్రసాద్, నాగయ్య, పోషాలు పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి

ములకలపల్లి: బ్యాంకు రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించాలని ఎస్‌బీఐ ములకలపల్లి బ్యాంకు మేనేజర్ రాజేంద్రనాయక్ సూచించారు. మూకమామిడి పాంఆయిల్ ఫెడ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో డైరెక్టర్ కరుటూరి కృష్ణ పర్యవేక్షణలో మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు రుణాలకు సంబంధించి కనీసం ప్రతీయేడాది వడ్డీ చెల్లించి, రెన్యూవల్ చేయించుకోవాలని తెలిపారు. రైతులకు బ్యాంకులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమావేశంలో తెలంగాణా స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్లు ఎం.ఆకాశ్, తేజ, తెలంగాణా అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాధ్యులు రవితేజ, ఎఫ్‌పీఓ కో–ఆర్డినేటర్లు శంకర్, కాశేశ్వరరావు, మూకమామిడి ఎఫ్‌పీఓ డైరెక్టర్లు కీసరి లక్ష్మి, పుల్లూరి వేణుగోపాల్, లీడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రైతులను వెంటనే ఆదుకోవాలి



ములకలపల్లి: మాట్లాడుతున్న కనకయ్య

ములకలపల్లి: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన.. తుఫాను ప్రభావంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు, చేతికొచ్చే దశలో నీటిపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి, రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పాడియం వెంకటేశ్వర్లు, ఊకంటి రవికుమార్, గొగ్గెల ఆదినారాయణ, గౌరి నాగేశ్వరరావు, మాళోతు రావూజా, నిమ్మల మధు, కుంజా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మిచాంగ్ తుపాన్ ప్రభావం వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రజాపంథా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. పంట నష్టం జరిగిన రైతులకు పరిహారంతో పాటుగా వడ్డీ లేని రుణాలు, ఉచిత ఎరువులు, మందులను అందజేయాలని కోరారు. అనంతరం తుపాన్ వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ ముజాహిద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తాటి సత్యం, కుర్సం ముత్యాలరావు, రాముడు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మిచాంగ్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతాలందరికి తక్షణమే నష్టపరిహారాన్ని చెల్లించాలని ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రజాపంథా, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు పరిహారం ఇవ్వడంతోపాటు, రబీ పంటలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. అదే విధంగా వరి, మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.25వేలు, పత్తికు రూ.50వేలు, మిర్చి పంటకు రూ.1లక్ష చొప్పున నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కంగాల భూలక్ష్మి, గోవింద్, ఎంపీటీసీ వాసం బుచ్చిరాజు, నాయకులు కంగాల కల్లయ్య, మడకం ముత్యాలరావు, పాపారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు పవర్ కట్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు భద్రాచలం విద్యుత్ శాఖ ఏఈ రాజారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎటపాక పరిధిలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అనగాశ్రీ



అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన బచ్చలకూరి అనగాశ్రీ అండర్–14 జూనియర్ పాఠశాలల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. అనగాశ్రీ మల్లెలమడుగు జెడ్పీ స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. మంగళవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టును ఎంపిక చేయగా.. ఈ జట్టులో అనగాశ్రీ ఎంపికై ంది. నేటి నుంచి మూడు రోజుల పాటు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టులో అనగాశ్రీ ఆడనుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అనగాశ్రీని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

నేటి నుంచి అధ్యాయనోత్సవాలు

దుమ్ముగూడెం: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో వైకుంఠ ఏకాదశి అధ్యాయనోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లను చేశారు. నేటి నుంచి 2024 జనవరి 2వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. బుధవారం నుండి స్వామి వారు మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, శ్రీకృష్ణ, కల్కి అవతారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ నెల 22వ తేదీన గోదావరి నదీ తీరంలో తెప్పోత్సవం నిర్వహించడానికి అధికారులు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు.

భగీరథ నీరు అందించాలి

చర్ల: చర్ల మేజర్ పంచాయతీలోని పలు కాలనీలలో మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడం లేదని పలుమార్లు విన్నవించినప్పటికీ పంచాయతీ అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం జోన్ కన్వీనర్ మచ్చా రామారావు అన్నారు. ఇప్పటికై నా తాగునీటి సరఫరా చేయాలని కోరుతూ మంగళవారం గ్రామపంచాయతీలో ఆయన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు శ్యామల వెంకట్, గ్రామస్తులు తాటి గాంధీ, తిరుపతిరావు, ముత్తయ్య, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, వీరయ్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఎదుట గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జీఓ నం.45ను అమలు చేయాలని కోరుతూ.. చేపట్టిన రిలే నిరహార దీక్షలు కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం దీక్ష శిబిరాన్ని ఏపీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు మల్లుదొర ప్రారంభించి మాట్లాడారు. ప్రకాష్, ఆదినారాయణమూర్తి, సురేష్, విజయ, జ్యోతి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, గోపి, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన



పేరంటాల చెరువు కట్టకు పడిన గండిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెం, అల్లిపల్లి, మందలపల్లి, మల్కారం, నాచారం తదితర గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు. అంతకుముందుగా మండలంలోని గండుగుపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే జారే నివాసంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛాలను అందజేశారు. మొద్దులగూడెం గ్రామ శివారులో ఉన్న ఏకులపోతమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే పర్యటనను ప్రారంభించారు. తుపాన్ తీవ్ర ప్రభావం వల్ల జరిగిన నష్టపోయిన పంటలను పరిశీలిస్తూ, పంట నష్టం వివరాలపై అధికారులతో చర్చించారు. దమ్మపేట గ్రామంలో గండి పడిన పేరంటాల చెరువు కట్ట, రోడ్డుపై వరద చేరడానికి కారణమైన కల్వర్టులు, డ్రెయినేజీలను పరిశీలించారు. వీటిపై సమగ్ర నివేదికను రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. శిథిలావస్థకు చేరిన బస్‌స్టేషన్‌ను పరిశుభ్రం చేయించి, బస్టాండ్‌కు బస్సులు వచ్చేలా చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దమ్మపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ రిజర్వేషన్‌ను జనరల్‌కు కేటాయించాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు కోటగిరి సత్యంబాబు, అలపాటి ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, అత్తులూరి వెంకటరామారావు, యర్రగొర్ల రాధకృష్ణ, ఎల్లిన రాఘవరావు, రావు రవిశంకర్, కెవి. సత్యనారాయణ, గుత్తా రాజా, పర్వతనేని ప్రసాద్, సాయిల నర్సీ, చామర్తి గోపిశాస్త్రి, చక్కిరాల మల్లేశ్వరరావు, పసుమర్తి పెదబాబు, వెంకటరమణ, ఎర్రా వసంతరావు, ఏసుమణి, శ్రీరాముల ప్రసాద్, రొయ్యల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సర్పంచ్, పాస్టర్లు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మల్లాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని నారంగుంపు గ్రామంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సియోను ప్రార్థన మందిరంలో సర్పంచ్ నారం రాజశేఖర్, పాస్టర్లు సున్నం సియోను, ప్రకాశ్‌రావు చేతుల మీదుగా సెమీక్రిస్మస్ కేక్‌ను కట్ చేసి విశ్వాసులకు పంపిణీ చేశారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు గీతాలను భక్తిశ్రద్ధలతో ఆలపించారు. అలాగే చిన్నారులు ప్రత్యేక నృత్యాలు చేయగా, విశ్వాసులను ఆకట్టుకున్నాయి. ఈ సెమీ క్రిస్మస్ వేడుకలకు మండలంలోని పండువారిగూడెం, దిబ్బగూడెం, నాగులగుంపు, రామన్నగూడెం, అల్లిగూడెం, అశ్వారావుపేట నుంచి విశ్వాసులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాస్టర్లు సీహెచ్ ప్రభాకర్, జి.నెహ్రూ, చంద్రం, రాజు, దేవదాసు, జాన్‌రాజు, వర ప్రసాద్, దిలీప్, దేవ సహాయం, విశ్వాసులు పాల్గొన్నారు.

తుపాన్ మిగిల్చిన ప్రమాదం



కేశప్పగూడెం–మొద్దులగూడెం మార్గంలో కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రహదారి



గుర్రాల చెరువు–అశ్వారావుపేట మార్గంలో కొట్టుకుపోయిన బీటీ రోడ్డు అప్రోచ్

అశ్వారావుపేటరూరల్: ఇటీవలె వచ్చిన మిచాంగ్ తుపానుతో పలు చోట్ల ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. జోరు వర్షం, వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో కోట్లాది రూపాయాలతో నిర్మించిన రోడ్లు కోతకు గురి కాగా.. ప్రస్తుతం అవి ప్రమాదకరంగా మారాయి. మండలంలోని కేశప్పగూడెం నుంచి మొద్దులగూడెం వైపు వెళ్లే ప్రధాన మార్గంలో చేపల చెరువు సమీపంలో దాదాపు వంద మీటర్లు, అశ్వారావుపేట నుంచి గుర్రాల చెరువు వెళ్లే మార్గంలోని ఈదుల చెరువు దగ్గరలో సుమారు 50 మీటర్లు, నారంవారిగూడెం నుంచి అచ్యుతాపురం వెళ్లే రోడ్డులో వాగు చప్టా వద్ద రహదారులు కోతకు గురైయ్యాయి. నారంవారిగూడెం, కేశప్పగూడెం వద్ద అయితే రహదారులు కోతకు గురై చప్టాలు సైతం బయట పడ్డాయి. దాంతో ఈ మార్గాలు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. నారంవారిగూడెం– అచ్యుతాపురం వెళ్లే మార్గంలో మరమ్మతులు తుపాను కారణంగా దెబ్బతిన్న మార్గాల్లో ఇప్పటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు తీరుపై స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె

అశ్వారావుపేటరూరల్: తమ న్యాయమైన తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ తపాల ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. స్థానిక తపాల బ్రాంచ్ కార్యాలయం వద్ద మంగళవారం ఉద్యోగులు నిరవధిక సమ్మె ప్రారంభించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, 8గంటల పని విధానాన్ని అమలు చేస్తూ, సీనియరిటి ఇంక్రిమెంట్ ఇవ్వాలని, అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ తపాల ఉద్యోగుల సమ్మె కారణంగా అశ్వారావుపేట మండలంలోగల 17 బ్రాంచ్ పోస్టు ఆఫీసులు తెరుచుకోలేదు. ఆయా కార్యాలయాల్లో అన్ని రకాల సేవలు నిలిచిపోవడంతో ఖాతదారులు, వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు టి.దుర్వాసరావు, కమిటీ బాధ్యులు నవీన్, ఎండి.ఫైజుద్దీన్, శశాంక్, వెంకటేష్, ఎస్‌కె.లాలు, శ్రీకాంత్, జ్యోతి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీడీఎస్పీజేసీఏ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా మణుగూరు మండల తపాలా ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, పెన్షన్‌తో సహ అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఐసీటీ డివైజ్‌లను ఉపసంహరించి ల్యాబ్‌ట్యాప్‌లు, ప్రింటర్లు, బ్రాడ్‌బాండ్ నెట్‌వర్క్ సదుపాయాలను అన్ని బ్రాంచ్ పోస్టాఫీస్‌లకు కల్పించాలని డిమాండ్ చేశారు. బిజినెస్ టార్గెట్‌ల వేధింపులను అరికట్టాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ కవరేజిని రూ.5లక్షల వరకు పెంచాలని, డిపార్ట్‌మెంట్ స్టాఫ్‌తో పాటు సమానంగా జీడీఎస్ గ్రాట్యూటీ పెంచాలని, పెయిడ్ లీవ్‌లను 180 రోజుల వరకు దాచుకుని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు, జీడీఎస్‌పి జేసీఏ నాయకులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని తపాలా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న తపాల శాఖ ఉద్యోగులు నిరవదిక సమ్మె చేపట్టడంతో తపాలశాఖలో అన్ని కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఈ సమ్మెలో మండలంలోని తపాలశాఖ ఉద్యోగులు విద్యాసాగర్, కోటారెడ్డి పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలోని పోస్టాఫీస్ ఎదుట తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఖమ్మం డివిజన్ జీడీఎస్‌పీజేసీఏ ఆలిండియా గ్రామీణ గాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ కేంద్ర సంఘాల పిలుపు మేరకు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు జగన్, ఆనంద్, ప్రమ్‌కుమారి, శశిధర్, పృథ్వీరాజు, ఇందుమతి, మహేష్, బుజ్జమ్మ, నవీన్ రెడ్డి, పూజిత, వంశి, వెంకట్రావు, శ్రీలక్ష్మి, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీడీఎస్‌పీజేసీఏ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా మణుగూరు మండల తపాలా ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, పెన్షన్‌తో సహ అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పలు ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. తపాలా ఉద్యోగులు, జీడీఎస్‌పీ జేసీఏ నాయకులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు



అశ్వారావుపేటరూరల్: సమ్మెలో భాగంగా నినాదాలు చేస్తున్న తపాలా ఉద్యోగులు